నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మరమ్మతుల కారణంగా గగన్ పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. త్రిషుల, పద్మశాలిపురం ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు త్రిషుల విల్లాస్, అపర్ణా త్రిలోక్, పద్మశాలిపురం, ఆప్కో కాలనీ, మధుబన్ కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో కోతలు విధిస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే వినియోగదారులు అందుబాటులో ఉండే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. 8712470104లో ఫిర్యాదు చేయాలన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తల్లి వందనం కార్యక్రమంలో భాగంగా ఉప్పర్‌పల్లి గవర్నమెంట్ స్కూల్, పోచమ్మ ఆలయం, బీజేపీ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనిత రెడ్డి, కీర్తి శ్రీను, బండారి బాలకృష్ణ, మల్లేష్ చారి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, అశోక్ రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మావతి, స్వప్న రెడ్డి, యాదయ్య, విజయ్ యాదవ్, తుంగ ఇంద్రరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పవన్, లడ్డూ, కరుణాకర్ గౌడ్ తదితరులు హాజరై మొక్కలు నాటారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ శరత్‌చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 12, 17, 18, 19, 20, 22వ డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: పెద్ద షాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'కార్యక్రమంలో భాగంగా రెండేళ్లపై బడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. ఈ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ, ప్రీ స్కూల్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, ఏఎన్‌ఎం నయోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలి



మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ శాంతినగర్ కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, నాయకులు టింకురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రూటు ఎక్కడి నుంచి..?

- శంషాబాద్-జీఎంఆర్ (మామిడిపల్లి) రహదారి విస్తరణ పాత అలైన్‌మెంట్ రద్దు
- నగంలోనే నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులు
- కొత్త ప్రణాళిక సిద్ధం చేస్తున్న హెచ్ఎండీఏ



చారికాలనీ మలుపు వద్ద నిలిచిపోయిన శంషాబాద్-జీఎంఆర్ చిన్మయ టర్నింగ్ (మామిడిపల్లి) రహదారి పనులు

శంషాబాద్: శంషాబాద్-జీఎంఆర్ టర్నింగ్ (మామిడిపల్లి) రహదారి విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నాలుగున్నర కిలోమీటర్ల పొడవున విస్తరణ చేపట్టాల్సిన పనులు సగం వరకు మాత్రమే పూర్తయ్యాయి. శంషాబాద్ పాత పట్టణంలో ఉన్న అభ్యంతరాలతో కొత్త ప్రణాళికలో తయారి కోసం అర్ధంతరంగా పనులు ఆపేశారు.

ఎక్కడి నుంచి ఎక్కడికి..

మామిడిపల్లి నుంచి జీఎంఆర్ చిన్మయవిద్యాలయ టర్నింగ్ వరకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని రహదారిని ఇప్పటికే 80 ఫీట్ల మేర విస్తరించి నాలులేన్ల రహదారిగా మార్చారు. ఇది ఇప్పుడు ప్రయాణికులకు అందుబాటులో ఉంది. జీఎంఆర్ చిన్మయవిద్యాలయ టర్నింగ్ శంషాబాద్ మున్సిపాలిటీ ప్రారంభం నుంచి సిద్ధాంతి రైల్వేగేటు వరకు మొత్తం నాలుగున్నర కిలోమీటర్ల పొడవు రోడ్డును 80 ఫీట్ల మేరకు రూ. 50 కోట్ల నిధులతో విస్తరించేందుకు హెచ్ఆర్‌డీసీఎల్ పనులు ప్రారంభించింది.

పట్టణంలో ససేమిరా..

ఈ రహదారి విస్తరణలో పట్టణంలోని వడ్డెర బస్తీ నుంచి సిద్ధాంతి రైల్వేగేటు వరకు మొత్తం 208 ఆస్తులు, పాక్షికంగా కొన్ని పూర్తిగా కొన్ని తొలగించాల్సిందిగా అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత గృహాలకు నోటీసులు సైతం ఆరు నెలల కిందటే జారీ చేశారు. పట్టణంలో రహదారి విస్తరణ చేయకుండా ప్రత్యామ్నాయం చూడాలని మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మరికొందరు ఆందోళన చేశారు. సిద్ధాంతి రైల్వేగేటు వద్ద బ్రిడ్జీ నిర్మాణం లేకుండా రోడ్డు విస్తరణ వల్ల ప్రయోజనం ఉండదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు 208 ఆస్తులకు మున్సిపాలిటీయే పరిహారం చెల్లించాల్సి రావడంతో దానికి మున్సిపాలిటీ సైతం తమ వద్ద అంత మొత్తం పరిహారం చెల్లించేందుకు అవకాశం లేదని తేల్చిచెప్పింది.

ప్రత్యామ్నాయమే పరిష్కారంగా..

ఓ వైపు రహదారి విస్తరణ పనులు ప్రారంభించిన హెచ్ఆర్‌డీసీఎల్ జీఎంఆర్ చిన్మయవిద్యాలయ టర్నింగ్ నుంచి చారికాలనీ మలుపు వరకు మొత్తం రెండున్నర కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేసింది. పట్టణంలో వచ్చిన అభ్యంతరాలతో పాటు పరిహారం చెల్లించడం గుదిబండగా మారుతుందనే ఉద్దేశంతో హెచ్ఎండీఏ మరో ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించే పనిలో పడింది. చారికాలనీ నుంచి సింప్లెక్ వైపు లేదా సాతంరాయి మసీదు వద్దకు రోడ్డును మార్చే ప్రణాళికలను సిద్ధం చేసే పనిలో హెచ్ఎండీఏ పడింది. హెచ్ఎండీఏ వీలైనంత త్వరగా కొత్త ప్రణాళికను సిద్ధం చేస్తేనే రోడ్డు విస్తరణ పూర్తయ్యే అవకాశముంది. సగంలో వదిలేసిన రహదారితో ప్రయాణికులకు ప్రస్తుతం ఇబ్బందులు తప్పడం లేదు.

వడ్డెర బస్తీ వరకు విస్తరించాలని డిమాండ్.

పట్టణంలోని రహదారి విస్తరించేందుకు అభ్యంతరాలు ఓ వైపు ఉండగా మరో వైపు మహానగర్ కాలనీ, అహ్మద్‌నగర్ తదితర బస్తీల ప్రజలు మాత్రం చారి కాలనీ వద్దే రోడ్డును మలుపు తీసుకోకుండా కనీసం వడ్డెర బస్తీ వరకు 40 ఫీట్ల రహదారి చేస్తే శంషాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే వాదనలున్నాయి. వీరి డిమాండ్‌ను అధికారులు పరిగణలోకి తీసుకుంటారా..? లేదా..? అన్నది సంశయంగా మారింది. పట్టణంలో వచ్చిన అభ్యంతరాలతో రోడ్డు తమకు అనుకూలంగా రాజకీయ నేతలు, బడాబాబులు తమ భూములకు సమీపంలో నుంచి రోడ్డు వేసుకునేలా చక్రం తిప్పుతున్నారనే వాదనలు కూడా ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి.

అలైన్‌మెంట్ వచ్చిన తర్వాతే..

పాత అలైన్‌మెంట్ నిలిపివేసినందుకు హెచ్ఎండీఏ అందించే కొత్త అలైన్‌మెంట్ తర్వాతే పనులు ప్రారంభించనున్నాం. 4.5 కిలో మీటర్ల పొడవు విస్తరణ జరపాల్సిన ఈ రహదారిలో ఇప్పటికే 2.5 కిలో మీటర్ల రహదారి పనులు పూర్తయ్యాయి. కొత్త అలైన్‌మెంట్ తర్వాత రహదారి పొడవులో మార్పులు.. చేర్పులు జరిగే అవకాశముంది.

– విక్రమ్, డీఈ, హెచ్ఆర్‌డీసీఎల్

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు అందజేసి తోడ్పాటును అందజేస్తోందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలో మంగళవారం వివిధ వార్డులో రూ.11 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..శంషాబాద్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కూడా వెంటనే స్పందిస్తుందన్నారు. 1వ వార్డు నుంచి 25 వార్డు వరకు జరిగిన కార్యక్రమాల్లో ఆయనను స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి. సుమన్‌రావు, మాజీ సర్పంచ్ ఆర్. గణేష్‌గుప్తా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్, మాజీ కౌన్సిలర్లు వై.కుమార్, మేకలవెంకటేష్, అజయ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న లునెట్టా లేవుట్ కాలనీవాసులు

బండ్లగూడ: ప్రజా సమస్యలను అధికారులు పరిష్కరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లునెట్టా లేఅవుట్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కార్యాలయం ముందు వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ వైష్ణవి అపార్ట్‌మెంట్ పక్క లైన్‌లో ఉన్న లునెట్టా లేఅవుట్ నివాసితులు మూడేళ్లుగా డ్రైనేజీ సమస్యలతో ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నామన్నారు. ఎంతో మంది ప్రజా ప్రతినిధులను, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. లునెట్టా లేఅవుట్‌లోని లునేట్టా విల్లాస్, సిరి ఎన్‌క్లేవ్, పాలమూరు హైట్స్, క్రియస్ ఆసుపత్రి సిబ్బంది, చుట్టు పక్కల ఉంటున్న వాసితులు వందల మందితో కలిసి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. అలాగే జలమండలి అధికారులు పూర్తి సహకారంతోనే శాశ్వత పరిష్కారం అవుతుందని పెద్ద డ్రైనేజీ పైపులైన్ వేసి పనులు పూర్తి చేయాలన్నారు.

డ్రైనేజీ క్లీనింగ్ పనుల పరిశీలన

బండ్లగూడ: పేరుకుపోతున్న చెత్తాచెదారాలు, మట్టి కుప్పల తొలగింపు పనులను వేగవంతంగా శుభ్రం చేయిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం 2వ డివిజన్‌లోని గంధంగూడలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. కేకే నగర్ ఫేజ్-2లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. 14వ డివిజన్‌లోని భవానీనగర్ కాలనీలో జేసీబీతో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగింపు చేయించారు. ఈ కార్యక్రమంలో జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు శ్రీధర్, రామంజులు, రాము, సిబ్బంది పాల్గొన్నారు.



కేకే నగర్ ఫేస్-2లో డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

100 రోజుల కార్యాచరణపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు రీవెరిఫికేషన్, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరణ, నూతన రేషన్ కార్డుల వెరిఫికేషన్, ఆర్థిక సంవత్సరం 2025–26లో లక్ష్యంపై తదితర వాటిపై సమీక్షించారు. ఈ సమావేశంలో మేనేజర్ ఈ.మంజులత, మేనేజర్ టి.పర్వతాలు, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, డీఈఓలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

చెరువులో మురుగునీరు కలవకుండా చేయండి



ముష్కిన్ చెరువును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: వరద నీటితో ఆహ్లాదంగా ఉండాల్సిన చెరువుల్లో మురుగునీరు కలవటంతో దుర్గంధంగా తయారవుతున్నాయని, దానిని మున్సిపల్, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులు వెంటనే అరికట్టాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న ముష్కిన్ చెరువు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముష్కిన్ చెరువులో కలుస్తున్న మురుగునీటిని మళ్లించి వరద నీటిని మాత్రమే చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.నరేందర్, ఎ.లక్ష్మణ్‌రావు, జి.విఠల్, ఎస్. శ్రీకాంత్, బి. శ్రీధర్, షేక్ఆరీఫ్, కిరణ్, జైరాం, సుమనళిని, బాబురావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎంజీఐటీ యోగా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నిత్యం యోగా చేయాలి

మణికొండ: ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం, యోగా చేయాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. దాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ..యోగాతో అనేక రోగాలు దరిచేరడం లేదని ప్రపంచ వ్యాప్తంగా గుర్తించారన్నారు. ఈ సందర్భంగా ఇషా ఫౌండేషన్ వలంటీర్ ప్రత్యూష యోగా ప్రాముఖ్యతను వివరించి అనేక ఆసనాలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌కరెడ్డి, కోఆర్డినేటర్‌లు కె. పృథ్వీరాజ్, సీహెచ్.సుదీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దం శ్రీనుకు డాక్టరేట్



శ్రీనును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ముద్దం శ్రీనుకు డాక్టరేట్ లభించింది. నాగర్ కర్నూల్ జిల్లాపై మెలిసోపాలినాలజికల్ అధ్యయనం నిర్వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలినాలజీ, ప్లాంట్ సిస్టమెటిక్స్ ప్రయోగశాలలో డాక్టర్ ఎ.విజయ భాస్కర్ రెడ్డి మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ డిగ్రీ లభించింది. శ్రీను పరిశోధనలో నాగర్‌కర్నూల్ జిల్లా పూలు కలిగిన తేనెటీగల మొక్కల వనరులతో సంపన్నంగా ఉందని వెల్లడైంది. దీని ఆధారంగా జిల్లాల్లోని అనేక గ్రామాలు తేనెటీగల పెంపకం కోసం అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. ఈ పరిశోధన ప్రకారం రైతులు తమ పంట పొలాల్లో తేనెటీగల పెంపకాన్ని ఉప ఆదాయ మార్గం ప్రారంభించవచ్చు. దీని ద్వారా వారికి తేనె, తేనెటీగల ఉత్పత్తుల రూపంలో ఆదాయం లభించడమే కాకుండా పంటలకు సహజ పరాగ సంపర్క సేవలు అందుతాయి.

పోస్టర్ ఆవిష్కరణ

డబీర్‌పురా: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం మంత్రి జి.కిషన్ రెడ్డి ఈద్-ఇ-గదీర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, వక్ఫ్ సుధార్ జన జాగరణ్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్ జి.మనోహర్ రెడ్డి, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలపై ప్రజా భవన్‌లో ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రధానమైన సమస్యలపై ప్రజా భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రస్తుతం ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలు గాలికి వదిలేశారన్నారు. గత ప్రభుత్వంలో అమలు జరిగిన మధ్యంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాల్ని పూర్తి చేయాలన్నారు. అనేక బస్తీల్లో ప్రధాన రోడ్లకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యం, భాస్కర్, అశోక్‌కుమార్, మల్లేష్, జి.రాము, ప్రవీణ్, రాము, ఉప్పల్ శ్రీను, భగవాన్‌దాస్, సునీల్, నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- శాస్త్రిపురం డివిజన్ పరిధిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



శాస్త్రిపురంలో విద్యుత్ తీగలు భవనాలకు తగలకుండా దూరంగా కట్టిన దృశ్యం

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం డివిజన్‌లోని పలు బస్తీలలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. నివాసాలకు తీగలు తగులుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. చాలా చోట్ల విద్యుత్ తీగలు తమ భవనాలకు తగలకుండా ప్లాస్టిక్ పైపులు, కొబ్బరి తాళ్ల సహాయంతో దూరంగా కడుతున్నారు. విద్యుత్ తీగల సమస్యపై ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని శాస్త్రిపురం ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈదురగాలులు, వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ తీగలు ఒకదానితో తగిలి మంటలు వస్తున్నాయని ఫలితంగా హై ఓల్టేజ్ సమస్య నెలకొంటుందని ప్రజలు చెబుతున్నారు. తీగల కారణంగా తరచూ ఎలక్ట్రానిక్ వస్తువులు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగల కారణంగా భవనాలు, బాల్కనీలలో నిలబడలంటే భయంగా ఉంటుందిని శాస్త్రిపురం కాలనీల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ తీగలకు మరమ్మతులు చేసి భవనాలకు తగలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎఫ్‌సీసీహెచ్‌ఎస్ లేఅవుట్‌లో రోడ్లకు మార్కింగ్

సర్వే చేపట్టిన హైడ్రా అధికారులు



గచ్చిబౌలి: ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో రోడ్లకు హైడ్రా అధికారులు మార్కింగ్ చేశారు. రోడ్లను ఆక్రమించి ప్లాట్లు కనిపించకుండా లేఅవుట్ స్వరూపాన్ని మార్చారని ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదులు చేసిన క్రమంలో.. తాజాగా లేఅవుట్‌లో ఉన్న రోడ్లను గుర్తించేందుకు మంగళవారం హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య సర్వే చేశారు. అనంతరం లేఅవుట్‌లోని రోడ్లను గుర్తించి జేసీబీలతో మార్కింగ్ చేశారు.

- గచ్చిబౌలి సర్వే నెంబర్ 124,125లో దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట లేఅవుట్ చేశారు. దాదాపు 162 ప్లాట్లను యజమానులు సంధ్యా కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావుకు అమ్ముకున్నారు. మిగిలిన ప్లాట్లకు హద్దులు, రోడ్లు లేకపోవడంతో మిగిలిన వారు హైడ్రాను ఆశ్రయించారు. లేఅవుట్‌లో ఉన్న రోడ్లను పూర్తి స్థాయిలో మార్కింగ్ చేస్తామని అధికారులు వెల్లడించారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, తహసీల్దార్ సత్యబాబు, ఏడీ సర్వేయర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది: నటి రమ్యశ్రీ

శ్రీధర్‌రావు అనుచరులు తన సోదరుడు ప్రశాంత్‌పై దాడికి పాల్పడ్డారని నటి రమ్యశ్రీ ఆరోపించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ వద్ద కారు వద్దకు వెళుతుండగా దాడి చేశారని అతని వల్ల తనకు ప్రాణహాని ఉందన్నారు. ఇప్పటికే ప్రధానమంత్రికి లేఖ రాశానని రమ్యశ్రీ తెలిపారు. ఎంతోమందికి ఇప్పటికీ ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కాగా గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ దాడి జరిగిందని ఫిర్యాదు చేశారని, పరిశీలించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.